ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి
శనివారం సెప్టెంబరు 28, 2024

వడి వడిగా పర్యాటక అడుగులు


ప్రముఖుల ఘాట్ వద్ద తానియా బృందం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి ఇటీవల పలువురు అధికారులతో కాళేశ్వరంలో సమీక్ష నిర్వహించారు. ప్రతిపాదనలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు హైదారాబాద్‌కు చెందిన క్షేత్ర కన్సెల్టెన్సీ బృందం శుక్రవారం కాళేశ్వరం, మేడిగడ్డలో పర్యటించారు. తానియా ఆధ్వర్యంలో సభ్యులు కాళేశ్వరం ప్రముఖుల ఘాట్, సాధారణ ఘాట్, ఆలయ పరిసర ప్రాంతాలు, మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతాలను పరిశీలించారు. ప్రయాణ ప్రాంగణం నుంచి గోదావరి వరకు రహదారి విస్తరణ, ఆర్చి గేటు నుంచి ప్రముఖుల ఘాట్ వరకు రహదారి విస్తరణ, సాధారణ ఘాట్ వద్ద భక్తులకు శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం, దుస్తుల మార్పిడి గదులతో పాటు మేడిగడ్డ బ్యారేజీ దగ్గర ఇంటర్ పిటీషనర్ కేంద్రం, మ్యూజియం ఏర్పాటుకు పరిశీలించారు. దేవస్థానానికి సంబంధించి పలు ప్రతిపాదనలను ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం సంబంధిత డీపీఆర్‌ను ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్‌కు అందజేయనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. కాళేశ్వరం, మంథని, రామగిరిలను టూరిజం సర్క్యూట్‌గా గుర్తించగా కాళేశ్వరానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చి డీపీఆర్‌కు ఆదేశించడంతో బృందం సభ్యులు నివేదికను సిద్ధం చేయనున్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ ఏఈ జీవన్‌రెడ్డి, హరిత మేనేజర్ జక్కం సురేష్ పాల్గొన్నారు.

ఆకేరు పొడవునా.. ఇసుకాసురులదే ఇష్టారాజ్యం!



ఉమ్మడి వరంగల్‌లో సాగు, తాగునీటికి కీలకమైన ఆకేరు వాగు.. ఇసుక అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. మూడు జేసీబీ యంత్రాలు.. ఆరు ట్రాక్టర్లు అన్నచందంగా అడ్డదారుల్లో రేయింబవళ్లు తవ్వి రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల రాజకీయ నాయకుల మద్దతు.. మరికొన్ని చోట్ల పోలీసులు 'మామూలు'గా తీసుకుంటుండడంతో వారిని ఏం చేయలేని పరిస్థితి.. నిత్యం వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడుతుండడంతో నీటి నిల్వల కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం వరదలకు కొట్టుకుపోతున్నాయి. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల గుండా ప్రవహించే ఈ వాగులో ఇసుక అక్రమ రవాణా ఎక్కడెక్కడ జరుగుతుందో పరిశీలించి 'ఈనాడు' ప్రత్యేక కథనం.

ఈనాడు, మహబూబాబాద్,



రోజువారీ ఇసుక అక్రమ రవాణా ఇలా

ట్రాక్టర్లు	350
ఒక ట్రాక్టర్‌లో రవాణా (క్యూబిక్ మీటర్లు):	3
మొత్తం తరలిస్తోంది (క్యూబిక్‌మీటర్లు):	1050
ఒక ట్రాక్టర్ ఇసుక ధర: రూ.	6000
అక్రమార్కులు పొందుతున్న ఆదాయం(రూ.లక్షలు)	21

నష్కల్ – ఉప్పుగల్లు – కూనూరు – నందనం – రాంనగర్ – వర్ధన్నపేట – ఇల్లంద – కొత్తపల్లి – ల్యాబర్తి – పర్వతగిరి – నెల్లికుదురు – జయపురం – చిన్న గూడూరు – ఉగ్గంపల్లి – ముల్కలపల్లి

120.6 కి.మీ. ప్రవాహం

జనగామ జిల్లా చిల్పూరు మండలం పైపాటు నుంచి ప్రారంభమయ్యే చిన్న ప్రవాహం నష్కల్ వద్ద ఆకేరు వాగుగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కపల్లి వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఇది ఉమ్మడి వరంగల్ పరిధి 4 జిల్లాల్లోని 13 మండలాల్లో 46 గ్రామాల మీదుగా 120.6 కి.మీ. ప్రవహిస్తోంది. పరివాహకంలోని దాదాపు 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తోంది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భజలాలు వృద్ధి చెందడానికి దోహదపడుతోంది.

- జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామ సమీపంలో వరద పెరగక ముందు 25 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుకను తరలించేది. ఇప్పుడు వరద ప్రవాహం ఉన్నా 15 ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు.
- ఐనవోలు మండలం నందనం, రాంనగర్ ప్రాంతాల్లో తవ్వకాలకు నెల రోజులుగా చెక్ పడింది. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారుల అండదండలతోనే రవాణా జరిగేదనే ఆరోపణలున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై వాగులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. సుమారు 100 ట్రాక్టర్లు ఇళ్లకే పరిమితమయ్యాయి. కొందరు అక్రమార్కులు రాత్రిపూట తరలిస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఎలాగైనా అధికారులను మచ్చిక చేసుకుని ఇసుక రవాణా చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.
- వర్ధన్నపేట మండలం ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపల్లి, ల్యాబర్తి ప్రాంతంలోని వాగు నుంచి ప్రతి రోజు 250 ట్రాక్టర్ల ఇసుక నగరానికి తరలుతోంది. తెల్లవారుజామున 3 గంటలకు ఖమ్మం-వరంగల్ 563వ జాతీయ రహదారిపై దాదాపు 2 కి.మీ. పొడవునా ట్రాక్టర్ల వరుస కనిపిస్తుంది. తోడేందుకు జేసీబీ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇసుకతో కూడిన మట్టిని సైతం వాహనంలో నింపి నీటితో మట్టిని వేరు చేస్తున్నారు.


ఇల్లంద సమీపంలో


కొత్తపల్లిలో మట్టిని వేరు చేశాక..


ల్యాబర్తిలో జేసీబీ యంత్రం ద్వారా..

వాగు నుంచి చెరువుకు

జఫర్‌గఢ్ మండలం కోనాచలం ప్రాంతంలోని వాగు నుంచి వర్ధన్నపేట పెద్ద చెరువులోకి వరదనీరు వెళ్లేలా కట్టు కాలువ నిర్మించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి ప్రాంతంలోని మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా రాయపర్తి మండలం కొత్తూరులోని రెండు చెరువుల్లోకి, అక్కడి నుంచి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ చెరువులోకి వరదనీరు వెళ్తోంది. నెల్లికుదురు మండలం ఎర్రబెల్లి గూడెం వద్ద వాగుపై ఉన్న మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా నెల్లికుదురు పెద్ద చెరువులోకి ఆకేరు వరద ప్రవహిస్తుంది. అక్కడా అక్రమ రవాణా సాగుతోంది.

- పర్వతగిరి మండలంలోని చెరువుముందుతండాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారుల నిఘాతో తవ్వకాలు నిలిచాయి. త్వరలోనే తవ్వకాలు చేసేందుకు అక్రమార్కులు అధికారులు తమని పట్టించుకోకుండా చూడాలని పేరున్న ప్రజాప్రతినిధిని కలవాలని సన్నద్ధమవుతున్నారు.

తవ్వకాలను అడ్డుకోవాలని చెప్పాం..

రెవెన్యూశాఖలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడంతో అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టలేకపోతున్నాం. తవ్వకాలను అడ్డుకోవాలని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లకు చెప్పామని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు పేర్కొన్నారు.


నెల్లికుదురులోని వాగులో నీటిలో దిగబడిన ట్రాక్టర్‌ను బయటికి లాగుతున్న మరో రెండు ట్రాక్టర్ ఇంజిన్లు


నర్సింహులపేట మండలం జయపురం, చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు, మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి, ఉల్లేపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లోంచి 50 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది.



- నెల్లికుదురు మండలం నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, మునిగలవీడు సమీపంలోని వాగుల్లోంచి ప్రతి రోజు 35 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది. వరదనీటిలోంచే ఇసుకను తవ్వి తరలిస్తున్నారు.

కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 45 కేసులు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 64 నమోదు చేసి 96 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 98 వాహనాలను పట్టుకుని కేసులు పెట్టకుండా మైనింగ్‌శాఖకు అప్పగించారు


మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద..

చేతి వృత్తులకు చేయూత

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: గతంలో చేతి వృత్తిదారులకు గ్రామాల్లో అనేక ఉపాధి అవకాశాలు ఉండేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని హస్త కళాకారులు నూతన ఒరవడి అందిపుచ్చుకోవడంలో కొంత వెనుక పడ్డారు. దీంతో వారికి నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు యంత్ర పరికరాలు (టూల్ కిట్లు) పంపిణీ చేయడంతో పాటు తక్కువ వడ్డీకి రుణాలు అందించి వారి ఎదుగుదలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అర్హులైన హస్త కళాకారుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించి శిక్షణతో పాటు రుణాలను అందిస్తోంది.

143 మందికి రుణాల అందజేత..

ఈ పథకానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 3172 దరఖాస్తులు వచ్చాయి. 1179 మందిని శిక్షణకు పంపించారు. ఇప్పటి వరకు 340 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. 143 మందికి రూ. లక్ష రుణ సదుపాయం కల్పించినట్లు అధికారులు తెలిపారు. నిపుణులతో నైపుణ్యాల అంచనా, ప్రాథమిక శిక్షణ, అధునాతన శిక్షణ ఇలా మూడు విభాగాలుగా శిక్షణ అందిస్తున్నారు. ప్రాథమిక శిక్షణ పూర్తయ్యాక లబ్ధిదారులకు యంత్ర పరికరాలు (టూల్‌కిట్) కొనుగోలుకు రూ. 15 వేలు చెల్లించనున్నారు. అనంతరం బ్యాంకులో తక్కువ వడ్డీతో రూ. లక్ష రుణం మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు.


గణపురంలో పాదరక్షల దుకాణం నెలకొల్పిన యువకుడు

మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు..

భూపాలపల్లి	చిట్యాల	గణపురం	కాటారం	మహదేవపూర్	మల్హర్‌రావు	మొగుళ్లపల్లి	మహాముత్తారం	పలిమెల	రేగొండ	టేకుమట్ల	భూపాలపల్లి మున్సిపాలిటీ
148	439	277	262	106	169	170	71	37	810	116	567

వీరికే పథకం వర్తింపు..

విశ్వకర్మ పథకంలో భాగంగా స్వయం ఉపాధి ప్రాతిపదికన సాంప్రదాయ వృత్తులలో నిమగ్నమైన చేతివృత్తి దారులు, హస్త కళాకారులు ఈ పథకానికి అర్హులు. వడ్రంగి, కమ్మరి, పడవలు, ఆయుధాలు, సుత్తులు, టూల్‌కిట్లు తయారుచేసే వారు, శిల్పులు, స్వర్ణకారులు, కుమ్మరి, చెప్పులు కుట్టే వారు, తాపీలు, బుట్ట, చాపలు, చీపుర్లు, బొమ్మలు తయారు చేసే వారు, నాయీ బ్రాహ్మణులు, పూలదండలు తయారు చేసేవారు, చాకలి, దర్జీలు, చేపల వలలు, తాళంచెవి తయారీదారులకు ఈ పథకం వర్తిస్తోంది.

సీఎస్‌సీ కేంద్రాల్లో దరఖాస్తులు..

సీఎస్‌సీ కేంద్రాలలో దరఖాస్తులకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కొరకు ఆధార్, ఫోను నెంబర్, బ్యాంకు వివరాలు, రేషన్ కార్డును సమర్పించాలి. అర్హుల ఎంపిక బాధ్యతను గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల వివరాలను జిల్లా పరిశ్రమల శాఖకు అందిస్తారు.

ఆర్థిక బలోపేతమే లక్ష్యం..

- సిద్ధార్థరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్



చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. అర్హులైన వారు సీఎస్‌సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. 18 రకాల చేతి వృత్తులకు శిక్షణ అందించి రుణసదుపాయం కల్పించనున్నారు.

దేశానికి సేవ చేయడం గర్వకారణం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేశం కోసం పని చేయడం ఎంతో గర్వకారణమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిపథ్ పథకం ద్వారా అగ్నివీర్ వాయు కార్యక్రమంపై విద్యార్థులు, యువతకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మీ, నేవీ, ఏవియేషన్‌లో చేరి దేశానికి సేవ చేయాలని, తల్లిదండ్రులు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. 17 నుంచి 21 ఏళ్ల లోపు యువతను అగ్నిపథ్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. యువతకు హైదరాబాద్ నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు అవగాహన కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఉపాధికల్పన అధికారి శ్యామల, అగ్నిపథ్ శిక్షకులు సందీప్ పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం..

అటవీ, రెవెన్యూ భూముల మధ్య నెలకొన్న భూ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అటవీ, రెవెన్యూ భూ సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాటారం మండలం పోచంపల్లిలోని సర్వే నెంబర్ 1 లో 660 ఎకరాల భూ సమస్య పరిష్కారానికి కాటారం సబ్ కలెక్టర్, అటవీశాఖ ఉన్నతాధికారులు సంయుక్త పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వసంత, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్డీవో మంగిలాల్, తహసీల్దార్లు, ఎఫ్ఆర్‌వో పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలి

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆలోచనలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా కళా ప్రదర్శనలు చేపట్టాలని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల కళాప్రదర్శనల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కళాకారుల కీలక పాత్ర పోషించాలన్నారు. కళాకారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో సంక్షేమ శాఖ, అలీమ్‌కో ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమాధికారి చిన్నయ్య, సీడీపీవో అవంతి పాల్గొన్నారు.

విహార యాత్రలకు అనుమతి

ములుగు, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు విహార యాత్రకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. శుక్రవారం ములుగు జిల్లా నుంచి విహారయాత్రకు వెళ్లే విద్యార్థుల వాహనాలకు జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ ములుగులో జెండా ఊపి ప్రారంభించారు. వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్, ములుగు మండలం మదనపల్లిలోని కస్తూర్బా విద్యార్థులు విహార యాత్రకు వెళ్లినవారిలో ఉన్నారు.

లంచం అడిగారు.. అనిశాకు చిక్కారు!


పట్టుబడిన నగదుతో ఏటీవో రవీందర్, ఈఈ హుస్సేన్ (పసుపు రంగు చొక్కా)

జనగామ, న్యూస్‌టుడే: ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన జనగామ కలెక్టరేట్‌లోని ఆర్ అండ్‌బీ ఈఈ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మాజీ సైనికుడు చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇదే మండలంలోని నెల్లుట్ల- లింగాలఘనపురం రహదారి పక్కన పెట్రోలు బంకును ఏర్పాటు చేసేందుకు తన భార్య పేరిట దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశిత రుసుము చెల్లించారు. ఆయనకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్ రూ.14 వేలు డిమాండ్ చేశారు. దీంతో సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఈఈ చిలుకపాటి హుస్సేన్‌కు రూ.12 వేలు, ఏటీవో రవీందర్‌కు రూ.2 వేలు ఇస్తుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం ఉదయం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సాంబయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలని కోరారు.

జనగామ జిల్లా కలెక్టరేట్‌లో వరుసగా వెలుగు చూస్తున్న అవినీతి ఘటనలపై ప్రత్యేక కథనం

'పట్టుబడుతున్నా..పట్టింపు లేదా?' 6లో..


నేలల స్వభావంపై పరీక్షలు

మహదేవపూర్, న్యూస్‌టుడే: గోదావరి తీర ప్రాంతాల్లో నేల స్వభావం, నీటి లభ్యత, తదితర అంశాలపై సర్వే చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఖనిజల అన్వేషణ శాఖ ఆధ్వర్యంలో మహదేవపూర్ మండలం ఎడపల్లిలో జియాలాజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో లోతులో డ్రిల్లింగ్ చేసి నేల మట్టిని తీసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో నేలల స్వభావం ఏ విధంగా ఉంది.. ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటున్నాయో... నీటి లభ్యత, ఖనిజాలు, నిక్షేపాలు, చమురు, తదితర వాటి కోసం పరీక్షిస్తున్నారు. ఆయా నమూనాలను మరో శాఖ అధికారులు సేకరించి పరీక్షలు చేయనున్నారు. ఎడపల్లి శివారు ప్రాంతంలో ఈ సర్వే జరుగుతోంది. మరో పది రోజుల పాటు చేయనున్నారు. ఎడపల్లిలో పూర్తయిన తర్వాత బొమ్మాపూర్‌లో చేపట్టనున్నారు. సీనియర్ టెక్నీషియన్ శివకుమార్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జయరామ్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆకాశానికి పచ్చని పందిరి

ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కలిసిపోయి, ఆకాశానికి పందిరి వేసినట్లు ఈ రోడ్డు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా వెళ్తుంటే అడవిలో నుంచి వెళ్తున్నట్లు అనుభూతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి కొత్తకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆరు కిలోమీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనం నిండి కనువిందు చేస్తోంది.

– ఈనాడు, హనుమకొండ

ఓరుగల్లుకు 'ఘన' స్వాగతం!



ఓరుగల్లు.. ఎటుచూసినా.. చారిత్రక ఆలయాలు, గొలుసుకట్టు చెరువులు కనిపిస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయిస్తంభాల ఆలయంతో పాటు ఇతర ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేల మంది పర్యాటకులు వస్తుంటారు. అతిథులను ఆహ్వానించేందుకు వరంగల్ జిల్లాకు నాలుగు దిక్కులా స్వాగత తోరణాలు నిర్మించనున్నారు. అందులో ఒకటి వరంగల్ బొల్లికుంటలో, రెండోది హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో రాంపూర్ వద్ద, మూడోది ఎల్కతుర్తి, నాలుగోది నర్సంపేట వద్ద.. ఇలా నలువైపులా స్మార్ట్ సిటీ నిధులతో ప్రత్యేక స్వాగత తోరణాలు నిర్మించేందుకు అధికారులు పనులు మొదలుపెట్టారు. నిర్మాణాలు పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది. రోడ్డుకు ఇరువైపులా 8 భారీ స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై కాకతీయుల చరిత్ర, శిల్ప సౌందర్యం ఉట్టిపడేలా నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లా బొల్లికుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణానికి సంబంధించిన భారీ స్తంభాలను చిత్రంలో చూడొచ్చు. – ఈనాడు, హనుమకొండ



బంతి పూలవనం.. బతుకమ్మ వేడుకలకు సిద్ధం!

బతుకమ్మ పండగ సమీపిస్తున్న వేళ.. ఓ రైతు వేసిన బంతిపూల తోట ఎరుపు, పసుపు రంగుల పువ్వులతో విరబూసింది. మహబూబాబాద్ మండలంలోని మాధవపురం-కురవి రహదారి వెంట వాహనదారులను ఈ తోట ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్, నెహ్రూసెంటర్

ఉలిక్కిపడిన అడవి..!

- సిబ్బందిపై దాడులతో ఆందోళన

వారు.. రేయింబవళ్లు అటవీ సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తారు. వారిపైనే దాడి జరగడం అటవీ రక్షణ ఎంత ప్రమాదకరంగా మారిందో చెబుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి దామెరవాయిలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు అటవీ అధికారులపై కొందరు ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సరైన పరిష్కారం దొరకడం లేదు.

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి



గాయాల పాలైన అటవీ సిబ్బంది

విధులు.. కత్తిమీద సాము..

ఓ వైపు కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు, పోడుదారులు, అటవీ జంతువులతో ప్రమాదాలు పొంచిఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల వివాదంలో గొత్తికోయల చేతిలో శ్రీనివాసరావు అనే రేంజ్ అధికారి ప్రాణాలు పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

పోడు పేరుతో..

పోడు పేరుతో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పలువురు అడవులను నరికి వేస్తున్నారు. పోడు పట్టాల సర్వే సమయంలో మూడు జిల్లాల్లో 16 ఘటనలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోడును అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారు.

ఆయుధాలపై నిర్ణయమెప్పుడో?

అటవీ అధికారులు అడవుల్లో ఆయుధాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, పోడుదారులు, వేటగాళ్లతో ముప్పు పొంచి ఉంది. 1982కు ముందు అటవీ అధికారులకు తుపాకులు ఉండేవి. మావోయిస్టుల కదలికలతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మళ్లీ ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా.. అది నెరవేరడం లేదు.

గతంలో సంఘటనలు

- 2022 నవంబర్ 9న ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామంలో పోడు జరుగుతుందని తెలిసి వెళ్లిన సెక్షన్, బీట్ అధికారులపై వేట కుక్కలతో దాడి చేయించారు.
- 2022 సెప్టెంబర్‌లో జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో పోడుభూముల్లో ట్రాక్టర్లతో దున్నుతుండగా.. అటవీ అధికారులు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించగా దాడికి పాల్పడ్డారు. ఇద్దరు అధికారులు గాయపడ్డారు.
- 2021 అక్టోబర్‌లో జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం పందిపంపుల గ్రామంలో అటవీభూముల్లో సాగును అడ్డుకునే క్రమంలో అటవీ అధికారులపై పోడురైతులు కారంపొడి చల్లి, పెట్రోల్ పోశారు. మహిళా ఎఫ్ఆర్వోతో పాటు ఇద్దరు అధికారులకు గాయాలయ్యాయి.

ఆయుధాలు ఇవ్వడంపై త్వరలో నిర్ణయం



బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

మట్టెవాడ, న్యూస్‌టుడే: అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలు అందించే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అటవీ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్ చంద్రలను శుక్రవారం పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. దాడులు చేసిన వారిపై పీడీ, హత్యాయత్నం, తదితర కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ములుగు ఎస్పీని ఫోన్‌లో ఆదేశించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి: - ప్రభాకర్, సీసీఎఫ్, కాళేశ్వరం జోన్

అకారణంగా విధులు నిర్వర్తిస్తున్న అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రిలో చేర్పించాం. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. అడవుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. అటవీ సంపదను కాపాడే సిబ్బందికి అండగా ఉండాలి.

పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?

- జనగామ కలెక్టరేట్‌కు అవినీతి మకిలి
- పది నెలల్లో రెండో అనిశా ఘటన

ఈనాడు, వరంగల్, జనగామ, న్యూస్‌టుడే

అది జిల్లా పాలనా కేంద్రం. కలెక్టర్‌తోపాటు అనేక శాఖల అధిపతులు విధుల్లో ఉంటారు. కొందరు అవినీతి అధికారుల ఆగడాలకు అక్కడ అడ్డు లేకుండా పోతోంది. ఎవరుంటే మాకేంటి? మేం ఏ పనికైనా లంచాలు వసూలు చేసి తీరుతాం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. తమ శాఖ కార్యాలయాలనే అడ్డాగా మార్చారు. అదే జనగామ కలెక్టరేట్.

జనగామ జిల్లాలో గత మూడు మాసాల్లో నెలకొక అవినీతి అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు. కొందరు ప్రజాపాలనకు వేదికగా, పౌర సేవా కేంద్రంగా ఉండాల్సిన జిల్లా సచివాలయానికీ అవినీతి మురికిని అంటిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులే లంచావతారమెత్తి సహోద్యోగులను అవినీతి కూపంలోకి దించుతున్నారు. జనగామ ఆర్అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుసేన్‌తో పాటు, సహాయ సాంకేతిక అధికారి రవీందర్‌లు శుక్రవారం అనిశా అధికారులకు చిక్కడం కలకలం రేపింది.

సైనికుడినీ వదలలేదు: జిల్లాలోని లింగాలఘనపురం మండలం బండ్లగూడేనికి చెందిన చిర్ర సత్యపాల్‌రెడ్డి రెండు దశాబ్దాల పాటు సైన్యంలో దేశానికి సేవలు చేసి 20 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. పెట్రోలు బంకు స్థాపించేందుకు గతంలో చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల తమ మండలంలో బంకు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దీనికి కావాల్సిన నిరభ్యంతర పత్రం కోసం ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో నెలరోజుల కిందట అర్జీ ఇచ్చారు. రూ.17 వేల లంచం ఇవ్వాలని ఈఈ హుసేన్ డిమాండ్ చేసి, బేరం అనంతరం రూ.14వేలకు ఒప్పుకున్నారు. అధికారుల తీరు నచ్చక ఆయన వరంగల్ అనిశా అధికారులను సంప్రదించారు.

● సంవత్సరం	● ఏసీబీ కేసులు
2020	7
2021	7
2022	9
2023	11
2024	12

వారం కిందట తప్పించుకున్నారు..

వారం కిందటే అనిశా అధికారులు వ్యూహాన్ని అమలు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ రోజు ఈఈ లేకపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం టార్గెట్ మిస్ కాలేదు. రూ.14 వేలు ఈఈకి ఇవ్వగా, అందులో నుంచి రూ.2వేలు ఏటీవో రవీందర్‌కు ఇవ్వాలన్న సూచన ప్రకారం ఆయనకు అందజేశారు. శనివారం ఏసీబీ వరంగల్ ప్రత్యేక కోర్టులో వీరిని హాజరుపర్చనున్నారు.



ఆర్అండ్‌బి అధికారుల అవినీతి వ్యవహారం.. పట్టివేతపై వివరాలు చెబుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



ఫిర్యాదుదారు చిర్ర సత్యపాల్‌రెడ్డి

మధ్యవర్తులతో వసూలు

- గత నవంబరు 20న జనగామ మున్సిపల్ కమిషనర్ రజిత రూ.40 వేలు లంచం డిమాండ్ చేసి, సదరు డబ్బును తన కారు డ్రైవర్‌కు ఇవ్వమన్నారు. పక్కా వ్యూహంతో ఏసీబీ అధికారులు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు.
- గత జనవరిలో జిల్లా సచివాలయంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, ఒప్పంద ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇచ్చినా సంతృప్తి చెందక, మరో రూ.50వేలకు ఒత్తిడి తేగా సదరు ఉద్యోగిని అనిశాను ఆశ్రయించింది. లంచం తీసుకుంటూ వైద్యాధికారితో పాటు, జూనియర్ అసిస్టెంట్ అజహర్‌లు పట్టుబడ్డారు.

ఎక్కడ వీలైతే అక్కడ

రఘునాథపల్లి మండలం కంచనపల్లి పంచాయతీ కార్యదర్శి తాజా మాజీ సర్పంచి చేసిన పనులకు బిల్లు చెల్లించేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. మండల పరిషత్ కార్యాలయంలో సదరు డబ్బు తీసుకుంటూ జులై నెలలో పట్టుబడ్డాడు. పాలకుర్తి మండల మాజీ ఎంపీటీసీ సభ్యుడు చేసిన పనికి బిల్లు చెల్లించేందుకు మండల ప్రత్యేక అధికారి హోదాలో రూ.10వేల లంచం తీసుకుంటూ ఆ మండల ఇరిగేషన్ అధికారి గోపాల్ అనిశాకు చిక్కారు. పనిచేసే చోట కాకుండా నివాసం ఉన్న హనుమకొండ(నక్కలగుట్ట)లోని ఓ చోట లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

వారిద్దరిదీ ఒకే ఊరు

అవినీతి అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలి. తమ పనుల కోసం లంచం డిమాండ్ చేసే వారి ఆటకట్టించాలనే తపన అవసరమంటున్నారు సామాజిక వేత్తలు. ఈఈ హుసేన్ ఆటకట్టించిన సత్యపాల్‌రెడ్డి, జనగామ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన చెట్టిపల్లి రాజు ఇద్దరిదీ బండ్లగూడెం గ్రామమే.

ఆ ఇంటి యజమానికి నోటీసులు



భవనాన్ని పరిశీలించి, పట్టాదారుతో మాట్లాడుతున్న అధికారులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన ఇంటిని తహసీల్దార్ సదానందం, దేవాదుల ఎత్తిపోతల పథకం డీఈఈ ప్రశాంతి, ఎంపీడీవో అనిల్‌కుమార్ తదితరులు పరిశీలించారు. 'చెరువులోనే భవనం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఇల్లు కట్టిన సర్వే నెంబరుతో పాటు పరిసరాల రైతుల పట్టా భూములను సోమవారం పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని చెప్పారు. ధర్మసాగర్ పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ మహేందర్‌రెడ్డిలు ఆ ఇంటి యజమానికి నోటీసు జారీ చేశారు. పంచాయతీ నుంచి గానీ, కుడా నుంచి గాని ఏవిధమైన అనుమతి లేకుండా ఇల్లు ఎలా నిర్మించారని, దీనికి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉందా, బఫర్‌జోన్‌లో ఉందా నిర్ధారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, సర్వేయర్ సురేందర్, దేవాదుల ఎత్తిపోతల పథకం ఏఈఈ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆందోళన



హనుమకొండ డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమించడానికి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 274 మంది ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 5 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 16 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అర్హులైన అభ్యర్థులు హనుమకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో కంగుతిన్నారు. ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులకు కనీసం సమాచారం అందించే వారేలేరని వాపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేచి చూసిన వారంతా అక్కడే ఆందోళన చేశారు. ఎంతో ఆశతో వస్తే పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న విద్యాశాఖ అధిశాఖ సిబ్బంది అప్పటికప్పుడు ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఒప్పంద పద్ధతిలో ఉద్యోగాలు చేసేందుకు అంగీకారం తెలిపిన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండ విద్యార్థి ఆత్మహత్య



భుక్య అక్షిత్ (పాతచిత్రం)

ఈనాడు, వరంగల్ : అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండకు చెందిన విద్యార్థి భుక్య అక్షిత్ (24) గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన అక్కడ ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుజరాత్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 27 నుంచి ఐఐఎం క్యాంపస్‌లో రెడ్ బ్రిక్స్ సదస్సు (టీఆర్‌బీఎస్) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకల్లో అక్షిత్ కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. 25 మంది విద్యార్థులు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తుండగా అక్షిత్ అందులో ఒకరు. ఈ సదస్సుకు గౌతమ్ అదానీతోపాటు ప్రముఖ వ్యాపార దిగ్గజాలు హాజరై ప్రసంగించాల్సి ఉంది. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురైన అక్షిత్ వసతిగృహంలోని తన గదిలో నైలాన్ తాడును ఉపయోగించి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన రెడ్ బ్రిక్ సదస్సును ఐఐఎం రద్దు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. వస్త్రాపూర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అక్షిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సోలా సివిల్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి శుక్రవారం ఉదయం అక్షిత్ తల్లిదండ్రులు అహ్మదాబాద్ చేరుకున్నారు. అక్షిత్ చదువుల్లో చాలా చురుకైన విద్యార్థి. భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఏడాదిపాటు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు. 2023లో ఐఐఎంలో సీటు రావడంతో ఎంబీఏ కోర్సులో చేరారు. అక్షిత్ ఆత్మహత్యకు ఒత్తిడే కారణమా మరేదైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

అవివాహితులకు సువర్ణావకాశం



నేడు, రేపు మేరు/దర్జి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి.నెట్ మేరు/దర్జి కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు శనివారం(సెప్టెంబరు 28), ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 837444 5190, 800800 2165లో సంప్రదించవచ్చు.

3న ఎంఏ తెలుగు ప్రవేశ పరీక్ష

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలకు అక్టోబరు 3న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పీఠాధిపతి ఆచార్య బి.బాబురావు శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసిన వారు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్లో wwwpstu-cet.org వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉంటుందని, సకాలంలో హాజరు కావాలని అన్నారు.

శరన్నవరాత్రులకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం



రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 13 వరకు జరిగే శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఈవో శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు ఆహ్వాన పత్రిక అందజేశారు. నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలు, బ్రోచర్లను శుక్రవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం..



కాటారం, న్యూస్‌టుడే: కాటారం-మహదేవపూర్ జాతీయ రహదారిపై వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. కూలీ పనులకు వెళ్లే క్రమంలో వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాల్సి ఉన్నా.. సామర్థ్యానికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలిస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, పట్టణంలో, గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు వేడుకల మందిరంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

'అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి'



మాట్లాడుతున్న కొరిమి రాజ్‌కుమార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: గడిచిన ఆర్థిక సంవత్సరంలో సాధించిన సింగరేణి లాభాల వాటా చెల్లింపుపై జరుగుతున్న అసత్య ప్రచారాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలని, కార్మికుల సంక్షేమం కోసం తమ సంఘం ఎంతో పాటుపడుతోందని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 6వ గని ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది ఏఐటీయూసీ నాయకత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రాంచందర్, సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి, సత్యనారాయణ,, లక్ష్మణమూర్తి, హకీం, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మొట్లపల్లి గ్రామశాఖ మేనేజర్ నరసింహరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రజలకు, విద్యార్థులకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండాలని లేకుంటే సైబర్ వలలో చిక్కుకునే ప్రమాదం ఉందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, సుకన్య యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, బ్యాంకు సిబ్బంది రంజిత్‌కుమార్, అనిల్, నాబార్డ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష సరికాదు

కాటారం, న్యూస్‌టుడే: ప్రభుత్వ అధికారిక కార్యక్రమమైన చాకలి ఐలమ్మ జయంతిపై అధికారులు వివక్ష చూపడం సరికాదని రజక సంఘం నాయకులు శుక్రవారం ఆరోపించారు. సంఘం నాయకులు పైడాకుల సురేష్, పున్నం శంకర్, సతీష్, రజనీకాంత్, పవన్‌లు మండల కేంద్రంలో మాట్లాడుతూ.. గురువారం నిర్వహించిన జయంతి ఉత్సవాలకు అధికారులు హాజరుకాలేదని విమర్శించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

అలరించిన మండల స్థాయి కళోత్సవాలు

కాటారం, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి కళోత్సవాలు అలరించాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆరు రంగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన ఆరుగురిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రూపు డ్యాన్స్, వాయిద్య సంగీతంలో కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాటలు, కథల పోటీల్లో దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, చిత్ర లేఖనంలో కాటారం గిరిజన గురుకుల బాలికల పాఠశాలల విద్యార్థులు సౌమ్య, మార్త, గీత్విక, దమయంతి, సాత్విక్‌లు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, హెచ్‌ఎం ఉమారాణి, సతీష్, ప్రతాప్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ, యాదవ కాలనీలో రూ. 55 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూపాలపల్లి అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నట్లు తెలిపారు. గుత్తేదారులు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



కాటారంలో కేక్ కోస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



భూపాలపల్లి: సింగరేణి జీఎం కార్యాలయం ఆవరణలో..

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతో మందికి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని తన మంత్రి పదవిని సైతం వదిలేశారన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో లక్ష్మణ్ బాపూజీ పాత్ర కీలకమైందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని ఆయన ఆశయాలు తరతరాలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ అభివృద్ధి అధికారి శైలజ డీపీఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి బడుగు బలహీన వర్గాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం ఆహార ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దోమల సమ్మయ్య, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, నాయకులు పంతకాని సమ్మయ్య, చల్లా నారాయణరెడ్డి, రాజేందర్, రమేష్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, రమేష్, సుజాత, సత్యనారాయణ, గట్టయ్య, సంతోష్, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి జీఎం కార్యాలయం ఆవరణలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని సింగరేణి అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి స్థానిక జీఎం నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కీలక పాత్ర పోషించినట్లు ఈ సందర్భంగా జీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి



కేజీబీవీ విద్యార్థినికి జ్ఞాపిక అందిస్తున్న ఎంఈవో, సతీశ్‌గౌడ్

టేకుమట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సతీశ్, ఎంఈవో చిదిరాల సుధాకర్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. స్థానిక కేజీబీవీ విద్యార్థినులు అండర్ 14, 17 విభాగంలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న తెలిపారు. కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు రాకేశ్‌రెడ్డి, ఆనంద్, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంకాపూర్‌కు రైతుల విజ్ఞాన యాత్ర



పసుపు పంటను పరిశీలిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నాబార్డు సౌజన్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఎంపిక చేసిన ఆదర్శ రైతులు విజ్ఞాన యాత్రకు వెళ్లారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో పసుపు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. ఆధునిక పద్ధతుల్లో ఎత్తుబోదెలు, జంట పద్ధతిలో పసుపు సాగు, అంతర పంటలుగా పప్పుధాన్యాలు, గడ్డి నివారణ తదితర అంశాల గురించి శాస్త్రవేత్తలు వారికి వివరించారు. వానాకాలంలో పసుపు తరువాత మిరప సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని వివరించారు. యాసంగిలో ఎర్రజొన్న సాగు మేలని సూచించారు. రైతు విజ్ఞానయాత్రలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా. రాములు, ఏఈవో సవిత, ఎంపిక చేసిన ఆదర్శరైతులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారులు శుభ్రం



పలిమెల, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బందికి సేఫ్టీ కిట్స్ అందచేసి జీవిత బీమా సౌకర్యం కల్పించారు. అనంతరం శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలు తొలగించారు. సర్వాయిపేటలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శులు శ్రీధర్, రాంబాబు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

టేకుమట్ల: హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ నెల 29న ఏర్పాటు చేయనున్న రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం మండలాధ్యక్షుడు ఆరకొండ రాజయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య, జిల్లా నాయకుడు యుగేందర్ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మారపెల్లి కొంరయ్య, మాదుగుల వీరయ్య, ప్రభాకర్, రాములు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ధరణి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

గణపురం: రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ధరణి ఆపరేటర్లకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి నెలా వేతనాలు చెల్లించి న్యాయం చేయాలన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్

మహదేవపూర్: పర్యాటక రంగం అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువ టూరిజం క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఆ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందుతారని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు.

భూపాలపల్లి: పర్యాటకంతోనే మనోవికాసం చెందుతామని భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రుక్సానా అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ హైమావతి, రామచంద్రం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులను మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన తిరుపతి, శనిగరపు రాజయ్య, ఎర్రం లక్ష్మయ్య, బంగ్లాపల్లికి చెందిన అన్నబోయిన చంద్రయ్య కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. పిడిసిల్ల గ్రామంలో నైనకంటి రుక్కమ్మ మరణించగా ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు తిరుపతిరావు, నాయకులు జోరుక సదయ్య, కొడారి రమేష్, అన్నారెడ్డి, రహీం, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు చేయూత

కాటారం: గంగారం జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక మాజీ సర్పంచి తెప్పల దేవేందర్‌రెడ్డి, అతడి సోదరుడు కాంగ్రెస్ నేత ప్రభాకర్‌రెడ్డిలు చేయూత అందించారు. విద్యార్థులకు బ్యాగులు, షూ, మంచినీళ్ల బాటిళ్లు, వంట నిర్వాహకులకు గ్యాస్‌స్టవ్, సిలిండర్‌ను శుక్రవారం కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాలతి, రాంబాబు, కృష్ణవేణి, నాయకులు నవీన్‌రావు, సత్యనారాయణ, ప్రభాకర్, శ్రీధర్, రమేష్, రాజు, కుమార్, కొమురయ్య పాల్గొన్నారు.

విద్యుత్తు అంతరాయంతో ఇబ్బందులు

మహదేవపూర్: మహదేవపూర్ మండల కేంద్రంలోని ఆయా కాలనీలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ పేర్కొన్నారు. కొన్ని రోజులుగా తరచూ విద్యుత్తు అంతరాయం కలుగుతుందన్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని, మిగిలిన కాలనీలో సమస్యను వెంటనే పరిష్కారిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

'పౌష్టికాహారంతోనే ఆరోగ్యం'

రేగొండ, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని రేపాక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం గ్రోత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుమలత, రమ, శంకరమ్మ, హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు భాస్కర్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యనిధి కుంభకోణంపై విచారించాలని ధర్నా

గోదావరిఖని, న్యూస్‌టుడే: బొగ్గుగని కార్మికుల భవిష్యనిధిలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ.. సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ముందు ధర్నా చేశారు. కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని, మొత్తం లాభాలపై వాటా పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. 250 గజాల స్థలం కేటాయింపు, రూ. 50 లక్షల వడ్డీలేని రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు సారంగపాణి, మహేశ్, సతీష్, హరీణ్, సాంబయ్య, రామ్మూర్తి, నర్సింహులు, రాజశేఖర్, శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

'యాజమాన్యం.. ప్రభుత్వం కుట్ర'

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 30 వేల కోట్ల బకాయిలను అడగకుండా.. సంస్థ లాభాలను అభివృద్ధి కోసం కేటాయించడాన్ని సీఐటీయూ నాయకుడు ఎం. నర్సింహారావు ఖండించాడు. జీడీకే-5 ఓసీపీ, ఏరియావర్క్‌షాపుల్లో శుక్రవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా నికర లాభాలపై కార్మికులకు వాటా చెల్లిస్తున్నారని, ఈ సంవత్సరం కొత్త ఒరవడిని తీసుకువచ్చిన ప్రభుత్వం, యాజమాన్యం కుట్రల చేస్తున్నాయని ఆరోపించారు. నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, నరహరిరావు, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, గౌస్, వెంకటేశ్వర్లు, రహీంఖాన్ పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డున స్వచ్ఛత

గోదావరిఖని, న్యూస్‌టుడే: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఆర్జీ-1 అధికారులు శుక్రవారం గోదావరి ఒడ్డున, పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. అధికారులు రాంమోహన్, వెంకటేశ్వర్‌రావు, ఆంజనేయప్రసాద్, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రభాకర్, హన్మంతరావు, అశోక్‌రావు, దుర్గాప్రసాద్, గుర్తింపు సంఘం నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గు బాయి ముచ్చట్లు

ఒప్పంద కార్మికుల సమస్యలు ఏఐటీయూసీతో పరిష్కారం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికుల సమస్యలు ఏఐటీయూసీతోనే పరిష్కారమవుతాయని ఆ సంఘం నాయకుడు ఎం.ఎ.గౌస్ పేర్కొన్నారు. ఆర్జీ-1 ప్రాంతంలోని సెక్టర్-2 పారిశుద్ధ్య కార్మికుల వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

'కార్మికులను తప్పుదోవపట్టిస్తున్న సంఘాలు'

గోదావరిఖని, న్యూస్‌టుడే: లాభాల వాటాపై కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఏఐటీయూసీ నాయకుడు వి.సీతారామయ్య పేర్కొన్నారు. జీడీకే-2 గనిపై శుక్రవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడి.. దసరాకు ముందే అక్టోబరు 7న కార్మికులకు వాటా పంపిణీ చేయిస్తున్నామన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని, ఆదివారం బోనస్ కోసం దిల్లీలో జరిగే సమావేశంలో కార్మికులకు గతంలో కంటే ఎక్కువ మొత్తంలో చెల్లించే విధంగా ఒత్తిడి తెస్తామన్నారు. నాయకులు వై.వి.రావు, ఎల్లయ్యగౌడ్, రాంచందర్, అక్బర్‌అలీ, పోషం, రవీందర్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, శంకర్, ఎం.ఎ.గౌస్, రామస్వామి, రవి, వెంకటయ్య పాల్గొన్నారు.

కార్మికుడి తనయుడికి చెక్కు పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఓసీపీ-3 ఉద్యోగి సత్యనారాయణ కుమారుడు రాహుల్ ఐఐఎం ఇండోర్‌లో ఎంబీఏ సీటు సాధించగా.. ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ రూ. 3.35లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. ఉన్నత విద్యనభ్యసించే ప్రతి ఒక్క కార్మికుడి కుమారునికి యాజమాన్యం ఆర్థిక సహకారం అందిస్తుందని జీఎం పేర్కొన్నారు.

సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ జరిపించాలి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్)లో జరిగిన కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సంస్థ సాధించిన వాస్తవ లాభాలను కార్మికులకు పంపిణీ చేయాలన్నారు. శుక్రవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడుడూ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రీహరికి అందజేశారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరావు, కేంద్ర కార్యదర్శి రవీందర్, ఏరియా ఉపాధ్యక్షుడు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని ఎంవీటీసీలో 48 రోజుల శిక్షణ పూర్తయిన 27 మంది ఉద్యోగుల వారసులకు శుక్రవారం జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు నియామక పత్రాలను అందజేశారు. ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రీహరి, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, సీనియర్ పీవో రాజేశం, జూనియర్ అసిస్టెంట్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా
టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

సమష్టిగా సమస్య పరిష్కారం



కాటారం, న్యూస్‌టుడే: ఎర్రగుంటపల్లి గ్రామస్థులు సమష్టిగా తమ సమస్యను పరిష్కరించుకున్నారు గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసేందుకు సీసీ రోడ్లను ధ్వంసం చేసి పైపు లైను వేశారు. సదరు గుత్తేదారు గుంతలను పూడ్చకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామంలోని యువకులు, పెద్దలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సొంత డబ్బులతో సిమెంట్, కంకరతో మరమ్మతులు చేసి గుంతలను పూడ్చారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి

కాటారం, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు చేపట్టి ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనులు చేయించారు. కాటారంలోని పలు దుకాణాలలో ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణదారులకు రూ. 2 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ



శ్రీదేవి

కాటారం, న్యూస్‌టుడే: కాటారం మండల విద్యాధికారిగా దేవరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇంజపల్లి శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో సుదర్శన్, రవీందర్, తిరుపతి, రాజబాబు, సురేష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మల్హర్ మండల ఎంఈవోగా కొయ్యూర్ ఎమ్మార్సీలో లక్ష్మణ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గణపురం: గణపురం మండల విద్యాశాఖ అధికారిగా ధర్మారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఊరుగొండ ఉప్పలయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

30న సర్వసభ్య సమావేశం

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్ ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 30న కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ముఖ్యకార్య నిర్వహణాధికారి రాజబాపు తెలిపారు. సంఘం సభ్యులు, రైతులు హాజరుకావాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ చోరీ.. నలుగురి అరెస్టు

మల్హర్, న్యూస్‌టుడే: ట్రాక్టర్ చోరీ సంఘటనలో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తాడిచెర్లకు చెందిన భాగమ్మ ట్రాక్టరును జూన్ 7న పొలం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన మహేందర్, రాజులు అపహరించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన స్వామితో కలిసి భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన అశోక్‌కు విక్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరికి నోటీసులు

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరికీ నోటీసులు అందించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇద్దరు కుమార్తెలు పట్టించుకోవడం లేదని ఓ తల్లి, కుమారుడు చూడడం లేదని ఓ తండ్రి కాటారంలోని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహదేవపూర్ కార్యాలయానికి పరిశీలనకు రాగా సదరు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 1న వారిని కౌన్సెలింగ్ హాజరుకావాలని సూచించారు.

అటవీశాఖ అధికారుల దాడిలో గాయాలు



బాధితులు (మధ్యలో చెయ్యి విరిగిన వ్యక్తి)

మహాముత్తారం, న్యూస్‌టుడే: వంట చెరకు సేకరణకు అడవికి వెళ్లిన వారిపై అటవీశాఖ అధికారులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుల కథనం ప్రకారం... మహాముత్తారం మండల కేంద్రానికి చెందిన తోటపల్లి సమయ్య, రామిళ్ల సురేష్, మంతెన రాజబాబపు, గందం వెంకటయ్యలు శుక్రవారం ఎద్దుల భూపాలపల్లి మండల పరిధి రాంపూర్ అడవులకు వెళ్లి వంట చెరకు సేకరిస్తుండగా ఇద్దరు అటవీశాఖ అధికారులు అడవిలోకి ఎందుకు వచ్చారని కర్రతో నలుగురిపై దాడి చేశారు. ప్రమాదంలో తోటపల్లి సమయ్య ఎడమ చెయ్యి విరిగింది. ముగ్గురు గాయపడ్డారు. బాధితులు మహాముత్తారం పోలీస్ స్టేషన్‌లో అటవీశాఖ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందినట్లు మహాముత్తారం ఏఎస్సై ఆకుల మహేందర్ తెలిపారు. చెయ్యి విరిగిన బాధితుడిని కుటుంబ సభ్యులు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

మహదేవపూర్, న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మాపూర్ గ్రామానికి చెందిన పుప్పిరెడ్డి తిరుపతి రెడ్డి అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై కె. పవన్‌కుమార్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో భూమి విషయంలో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం పురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తిరుపతిరెడ్డి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నాయకులు

మహదేవపూర్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోదండరాంను మహదేవపూర్‌కు చెందిన నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాడిన ఉద్యమకారుల సమస్యలను ఆయనకు వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ వినతి పత్రం అందించారు. సట్ల సత్యనారాయణ, నాయకులు అయూబోద్దీన్ పాల్గొన్నారు.